"శిష్యా! నేను నీ కన్నా పవిత్రుడినని, అలాగే శిష్యులని చేరదీసే గురువులంతా పవిత్రులని అనుకోకు. ఆధ్యాత్మిక మార్గంలో చిట్టచివరి స్థితికి చేరుకుని ఆత్మ సాక్షాత్కారం పొందేదాకా ఎంతటి గొప్ప సాధకుడినైనా అరిషడ్వర్గాలైన, కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు వదలవు. అవి సమూలంగా నాశనమవడమే ముక్తి. నిజానికి కామ క్రోధాలు లేకపోతే మనిషి కర్మ చేయడం కుదరదు. వాటి ప్రేరణతోనే మనిషి కర్మచేసేది. ఈ కర్మాచరణ లేకపోతే జన్మ ఎత్తడమే జరగదు. శ్రీకృష్ణుడు లాంటి అవతార పురుషులు పొందే మనుష్య జన్మ లోక శ్రేయస్సు కోసమే కాబట్టి, కేవలం అలాంటి వారికే అరిషడ్వర్గాలని జయించడం సాధ్యం."

"మరెలా స్వామీ?" ఆందోళనగా అడిగాడు శిష్యుడు.

"నీకు గమనింపుకి రాకపోయినా, నీ మనసు ఈ సాధనవల్ల పరిశుద్ధమవుతూనే వుంటుంది. సాధనవల్ల మనసులోని మురికి తప్పక పోతుంది. అయితే అందుకు కొన్ని జన్మలు పడుతుందని గీతలో కృష్ణుడు 'బహూ జన్మానాం' అన్నాడు. చిలుం పట్టిన ఇత్తడి గిన్నెని ఓ రోజు తోమినంత మాత్రాన మొత్తం చిలుము వదులుతుందా? అలాగే అనేక జన్మల నించీ పేరుకుంటూ వచ్చిన దుష్కర్మలు రెండేళ్ళలో ఎలా వదులుతాయి?"

ఇంకే ఆలోచనలు పెట్టుకోకుండా ఆ శిష్యుడు అదే పనిగా తీవ్రంగా ఆధ్యాత్మిక సాధనచేసి ఆ జన్మలోనే బ్రహ్మజ్ఞానం పొందాడు.

## 25. ఆత్మ స్వరూపం

ఓ రాజుగారు ఓసారి ఓ ఆధ్యాత్మిక గురువు చెప్పే ఉపన్యాసం విన్నాడు.

"ప్రతీ జీవిలో ఆత్మ ఉంటుంది. ఆ ఆత్మ ఒక్కటే సత్ పదార్థం. అది అణువు కన్నా చిన్నది. ప్రపంచం యావత్తూ ఆ ఆత్మ నించే పుట్టింది.

ఈ ప్రపంచమంతా ఆ అణువంత ఆత్మలోనే వుంది. ఐనా అది అదృశ్యంగానే వుంటుంది."

రాజుగారు వెంటనే లేచి అడిగాడు.

"మీరు చెప్పేది పరస్పర విరుద్ధంగా వుంది. ఆత్మ అణువు కన్నా చిన్నదన్నారు. అంత చిన్న దాంట్లోంచి ఈ విశాల ప్రపంచం పుట్టిందన్నారు. ఇది నమ్మేలా లేదు. అలాగే మళ్ళీ ఈ ప్రపంచం మొత్తం ఆ అణువంత ఆత్మలోనే ఉందన్నారు. అణువులో ఇంత విశాల ప్రపంచం ఎలా పడుతుంది? పైగా అదృశ్యం అంటున్నారు. మీరు చెప్పేది నిజమని నాకు నిరూపించండి. లేదా అబద్ధం చెప్పినందుకు మీ తలతీసి కోట గుమ్మానికి కట్టిస్తాను."

ఆ గురువు చిన్నగా నవ్వి చెప్పాడు.

"అదేమిటి? ఈ ప్రపంచంలో మన మధ్యే, మన కళ్ళముందే నే చెప్పిన ఈ వింత, నిత్యం జరుగుతూంటే చూసి కూడా నమ్మనంటావు?"

"నేనలాంటిదేం చూడలేదే?" చెప్పాడు రాజు.

"చూసావు. కానీ నీకు గుర్తు లేదంతే."

గురువు ఓ మర్రి విత్తనాన్ని తెప్పించి రాజుకిచ్చి చెప్పాడు.

"దీంట్లో మర్రి చెట్టుందేమో కోసి చూడు."

రాజు ఆ సూక్ష్మమైన విత్తనాన్ని మధ్యకి చీల్చి అందులో మర్రి చెట్టే కాక అసలేమీ లేదన్నాడు.

"ఏమీ లేని ఇంత చిన్న విత్తనం నించి అంత మర్రి చెట్టు ఎలా వస్తుందో, అలాగే అణువంత ఆత్మనించి ఇంత విశాల ప్రపంచం ఉద్భవిస్తుందని అర్థమైందా? అలాగే మర్రి చెట్టుకి కాసే పండులో, మళ్ళీ అంత పెద్ద చెట్టు వచ్చే విత్తనం దాగుంది. ప్రపంచమంతా ఆ ఆత్మలో ఉండడం అంటే ఇదే. మన కంటికి కనిపించే ఈ చిన్న ఉదాహరణతో నేను చెప్పింది సాధ్యమని నమ్ముతావా ఇప్పుడు?"

రాజు అందుకు ఒప్పుకుని మళ్ళీ అడిగాడు.

"ఆత్మ కంటికి కనబడక పోవడం ఏమిటి? దానికీ ఓ దృష్టాంతం చూపించండి."

గురువు ఓ నీటిపాత్రని, ఉప్పుని తెప్పించాడు. ఉప్పుని ఆ నీటిలో పోయమని రాజుకి చెప్పాడు. అది కరిగాక అడిగాడు.

"ఉప్పు కంటికి కనబడుతోందా?"

"లేదు. అది పూర్తిగా నీళ్ళలో కరిగిపోయిందిగా." చెప్పాడు రాజు ఆసక్తిగా.

"కంటికి కనబడకపోయినా ఆ ఉప్పు నీటిని ఎలా ఆవరించుకుని ఉందో, అలాగే ఆత్మ కూడా ఈ ప్రపంచాన్నంతా ఆవరించుకుని ఉంది."

"ఇప్పుడు నాకు ఆత్మ స్వరూపం ఎలాంటిదో పూర్తిగా అర్థమైంది." తృప్తిగా చెప్పాడు రాజు.

## 26. మూడో మనిషి

గుండె శస్త్రచికిత్సలో ఓ సర్జన్‌కి గొప్ప నైపుణ్యం ఉంది. ఆయన కొన్నివేల ఆపరేషన్లు చేసాడు. దాదాపు అన్నీ విజయవంతం అవడంతో ఆయన హస్తవాసి మంచిదని, రోగికి ఢోకా లేదని, త్వరగా కోలుకుంటాడని ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

ఆయన్ని టివి, పత్రికలు ఎప్పుడు ఇంటర్వ్యూ చేసినా తన విజయానికి కారణం తను కానీ, రోగి కానీ కాదని ఓ మూడో మనిషని సమాధానం చెప్పసాగాడు. ఐతే ఆ మూడో మనిషి ఎవరన్నది ఆయనెప్పుడూ స్పష్టంగా చెప్పలేదు. ఆ ప్రశ్నకి జవాబు దాటవేస్తూంటాడు.

ఓ పెద్ద పారిశ్రామికవేత్తకి హృద్రోగం వచ్చింది. ఆయన ఈ సర్జన్ చేత ఆపరేషన్ చేయించుకోవాలనుకున్నాడు. ఆయన దగ్గరకి వెళ్ళి తన